# మౌలిక సమస్యలనుండి రైతాంగాన్ని దారి మళ్ళించేదే

# వైయస్‌ఆర్-పి.ఎం. కిసాన్ భరోసా పథకం

**రైతు** భరోసా పథకం గురించి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని గమనిస్తే, ఈ పథకంతో రైతు సమస్యలన్నీ పరిష్కారమైనట్లు, వారి జీవితాల్లో వెలుగులు వెల్లివిరయనున్నట్లు అభిప్రాయం కలిగిస్తున్నారు. ఈ పథకంలో అంత ప్రాముఖ్యత వుందా, రైతుల జీవితాల్లో మార్పులు తీసుకొస్తుందా, ఈ పథకం ఏ నేపధ్యంలో, ఏ ఉద్దేశంతో చేయబడిందనేది చూడాల్సి వుంది.

వలసపాలకుల నుండి అధికారాన్ని పొందిన భారత పాలకులు వ్యవసాయరంగంలో సామ్రాజ్యవాదుల దోపిడీ, ఆధిపత్య విధానాలను కాపాడుతూ అందుకు అనుగుణమైన విధానాలు అమలు జరుపుతున్నారు. సస్యవిప్లవం పేరుతో అధిక దిగుబడులకోసం అంటూ విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు విదేశాల నుండి దిగుమతి చేసుకున్నారు. దేశీయ విత్తనాలు, ఎరువుల వాడకం కనుమరుగయ్యే పరిస్థితిని పాలకులు సృష్టించారు. నేడు సేద్యంలో రసాయన ఎరువులు వాడందే పంటల దిగుబడిరాని పరిస్థితి ఏర్పడింది. వాటి ధరలు విపరీతంగా పెరుగుతూ సేద్యపు ఖర్చు రైతలకు మోయలేని భారంగా తయారయ్యింది. సేద్యపు ఖర్చుల కోసం చిన్న, సన్నకారు రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. రైతులకు 27 శాతానికి మించి బ్యాంక్ రుణాలు అందటంలేదు. వీటిల్లో కూడా అత్యధికంగా ధనిక రైతులు, భూస్వాములే పొందుతున్నారు. కౌలురైతులకు బ్యాంక్ రుణాలు ఎండమావిగా మారింది. పెట్టుబడికోసం అధిక వడ్డీలకు అప్పులు చేయకతప్పటం లేదు. ఆర్థిక ఇబ్బందులు, ప్రకృతి వైఫల్యాలను ఎదుర్కొని పంటలు పండిస్తే, న్యాయమైన ధరలు లభించక, అప్పులపాలై, తీర్చేమార్గం కానరాక వేలాదిమంది రైతులు బలవన్మరణాల పాలౌతున్నారు. సంక్షోభపు సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నారు.

తమ సంక్షోభానికి పాలకులే కారణమని తెలుసుకున్న రైతాంగం, సంఘటిత ఉద్యమాల బాట బట్టారు. మహారాష్ట్ర, పంజాబ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, గుజరాత్ మొదలైన రాష్ట్రాల్లో మిలిటెంట్ ఆందోళనలు చేశారు. దేశరాజధాని ఢిల్లీలో వివిధ రూపాల్లో ఆందోళనలు చేశారు. వందలాది మైళ్ళు సాగిన పాదయాత్రలో వేలాది మంది కదం తొక్కారు. పంటలకు న్యాయమైన ధరలు ఇవ్వాలని, అప్పులు రద్దుచేయాలనీ, వ్యవసాయ సబ్సిడీలు పెంచాలనీ, బహుళజాతి సంస్థలపై ఆంక్షలు విధించాలని నినదించారు. కేంద్ర-రాష్ట్ర పాలకుల విధానాలను దుయ్య బట్టారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ వివిధ రూపాల్లో అనేక ఉద్యమాలు చేశారు.

ఎన్నికల్లో రైతాంగం పాత్ర కీలకమన్నది పాలక పార్టీలన్నింటికి తెలుసు. గెలుపు- ఓటములను వారి ఓట్లు ప్రభావితం చేస్తున్నాయి. వారి ఓట్లకోసం అన్ని పార్టీలు వాగ్దానాల వర్షం కురిపిస్తూనే వున్నాయి. రైతుల రుణాలు రద్దు చేస్తానని, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుతోపాటు అనేక వాగ్దానాలు చేసి 2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపొంది చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. రైతులకు చేసిన వాగ్దానాల అమలులో చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. రైతాంగంలో తీవ్ర అసంతృప్తి గూడుకట్టుకొంది. వారి అసంతృప్తిని తనకు అనుకూలంగా మార్చుకొనే చర్యలను వైసిపి చేపట్టింది. 2019 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు నవరత్నాలను ప్రకటించింది. అందులో రైతాంగానికి పెద్దపీట వేసింది. అధికారంలోకి వస్తే పంట రాయితీ క్రింద సంవత్సరానికి 12,500 వేల చొప్పున నాలుగు సంవత్సరాల్లో 50 వేలు ఇస్తానని, మూడువేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుతోపాటు అనుక వాగ్దానాలు చేసింది. పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున ప్రచారం చేశాడు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రముఖంగా పేర్కొన్నాడు.

చంద్రబాబు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల ఫలితంగా 2019 సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పరాజయం పొంది, వైసిపి మెజారిటీ సాధించి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆమోదించిన అనేక పథకాల్లో ఒకటి వైయస్‌ఆర్-పి.ఎం.రైతుభరోసా పథకం.

రైతాంగ సంక్షోభానికి, బలవన్మరణాలకు, పాలకుల విధానాలకు వ్యతిరేకంగా అనేక రాష్ట్రాల్లో వెల్లువెత్తిన ప్రభావం ఆంధ్రప్రదేశ్ రైతాంగంపై పడుతున్న సమయంలో వారి అసంతృప్తిని ప్రక్కకు మళ్లించేందుకు జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం తెచ్చిందే వైయస్‌ఆర్- పి.ఎం.రైతు భరోసా పథకం.

వైయస్‌ఆర్ - పి.ఎం.కిసాన్ భరోసా పథకాన్ని అక్టోబర్ 15 నుండి వైసిపి ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. పథకాన్ని నాలుగు సంవత్సరాల నుండి ఐదు సంవత్సరాలకు పొడిగించి, అందించే మొత్తాన్ని సంవత్సరానికి 12,500 నుండి 13,500 రూ॥కు పెంచినట్లు ప్రకటించింది. చెప్పిన దానికన్నా ఎక్కువ ఇస్తున్నట్లు అవాస్తవ ప్రచారం చేస్తున్నది. పథక లబ్ధిదారులు ఎవరన్న విధి విధానాలను ప్రకటించింది. భార్య, భర్త, పిల్లలను కుటుంబంగా గుర్తిస్తుంది. ఈ కుటుంబం సొంతభూమి కలిగివుంటే పథకం వర్తిస్తుంది. కుటుంబంలో పెళ్ళయిన పిల్లలు వుంటే, వారు వివాహ ధృవీకరణ పత్రంతోపాటు వారి పేర

భూమి వున్నట్లు ఆధారం చూపితే వారికి కూడా పథకం వర్తిస్తుంది. అసైన్డ్ భూములు కలిగిన రైతులకు ఈ పథకం వర్తిస్తుంది. అత్యధిక హోదాలో వున్నవారు, గతంలో లేదా ప్రస్తుతం మంత్రులుగా, సహాయ మంత్రులుగా, ఎంపీలు, ఎమ్మెల్యేలుగా, శాసనమండలి సభ్యులుగా, మేయర్లుగా, జిల్లా పరిషత్ ఛైర్మన్‌లుగా పనిచేసిన వారికి, ప్రస్తుతం ప్రభుత్వ సేవల్లో వున్న, పదవీ విరమణ చేసిన కేంద్రప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, మంత్రిత్వ కార్యాలయాల్లో పనిచేసిన వారు, ప్రభుత్వరంగ సంస్థలు, వాటి అనుబంధ, ప్రభుత్వ పరిధిలోకి వచ్చే స్వతంత్ర ఉద్యోగులు, నెలకు 10వేలు అంతకుమించి పెన్షన్ తీసుకొనేవారు, ఆదాయం పన్ను చెల్లించేవారు, వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు మార్చిన వారికి ఈ పథకం వర్తించదు.

కౌలురైతుగా నమోదు అయిన వారికి ఈ పథకం వర్తిస్తుంది. అయితే కౌలుదారునికి ఏవిధమైన భూమి వుండగూడదు. ఆహారధాన్యాలు పండించే భూమి ఎకరానికి తగ్గకుండా, అపరాలు, నూనెగింజలు, పత్తి, మిరప, పొగాకు పండించే భూమి 0.4 హెక్టారుకు, కూరగాయలు పండించే భూమి అర ఎకరం, పశుగ్రాసం పండించే భూమి 0.2 హెక్టారుకు, తమలపాకుల పంట భూమి 0.04 హెక్టారుకు తగ్గకుండా కౌలుదారునికి కౌలు భూమి వుండాలి. దీనితోపాటు భూయజమాని కౌలు ఒప్పంద అంగీకారం వుండాలి. అప్పుడు మాత్రమే అతనికి వైయస్ఆర్ రైతు భరోసా వర్తిస్తుంది. భూమిలేని కౌలుదారుడు ఒకటికన్నా ఎక్కువ కౌలు ఒప్పందాలు చేసుకొన్నా అన్నిటినీ కలిపి ఒక యూనిట్‌గానే గుర్తిస్తారు. భూయజమాని ఒక కౌలు ఒప్పందమే చేసుకోవాలి.

వైయస్ఆర్ - పి.ఎం. రైతు భరోసా పథకానికి అర్హత, అనర్హతలను గమనించినప్పుడు పథక లబ్ధిదారుల్లో కౌలురైతుల సంఖ్య చాలా పరిమితంగానే వుంటుంది. కౌలురైతు గుర్తింపుకి భూయజమాని ఆమోదం తప్పనిసరి అనే నిబంధన వుండటంతో నూటికి 90 శాతం పైగా కౌలు రైతులు పథకానికి దూరమౌతారు. అభ్యుదయ భావాలున్న కొద్దిమంది భూయజమానులను మినహాయిస్తే, మిగతా భూయజమానులెవ్వరూ ఒప్పంద పత్రంపై సంతకం పెట్టటానికి ఆమోదం తెలపటంలేదు. భూస్వాములు సన్నకారు రైతుల్లో ఒప్పందం గురించి అనేక అనుమానాలు కలిగించటంతో కౌలు ఒప్పందం అంటేనే వారు భయపడిపోతున్నారు. వ్యవసాయ సంక్షోభం ఫలితంగా తమకున్న కొద్దిపాటి భూమిని కౌలుకిచ్చుకొని సన్నకారు రైతులు ఉపాధి పనులు చూసుకొంటున్నారు. ఇలాంటి రైతుల భూములను కొందరు ధనిక రైతులు, పేదలు కౌలుకి తీసుకొంటున్నారు. కౌలుకి తీసుకొన్న పేద రైతులకు కౌలు ఆమోదపత్రం ఇవ్వటానికి నిరాకరిస్తున్నారు. ఒప్పందం వలన ఏమౌతుందోననే భయంతోపాటు, పథకం ద్వారా లభించే డబ్బులు వదులుకోవటానికి ఇష్టపడటంలేదు. అందుకు భూమిని తిరిగి తీసుకోవటానికి కూడా సిద్ధపడుతున్నారు. అందుకు వారి ఆర్థిక పరిస్థితే కారణం. భూస్వామివద్ద ఎందరు భూమిని కౌలుకు తీసుకొన్నా, ఒక కౌలుదారునికే గుర్తింపు లభిస్తుంది. మిగతా కౌలుదారులు పథకంలోకి రారు. ఆ ఒక్కరికి లభించటం కూడా భూయజమాని ఇష్టంపై ఆధారపడి వుంటుంది. పేదల్లో కొందరు అనేక అవస్థలుపడి కుటుంబ శ్రమతో సేద్యం చేసుకొందామని అరెకరమో, లేదా 75 సెంట్లో భూమిని కౌలుకి తీసుకొంటే పథకం లోని నిబంధనల ప్రకారం వారికి కౌలురైతులుగా గుర్తింపు లభించదు. పథకంలోని ఈ నిబంధనల వలన కౌలురైతులుగా పథకానికి అర్హత పొందే వారు సముద్రంలో నీటిబొట్టుగా వుంటారు. భూమిని ఎవరు చేస్తున్నారు, కౌలుకి చేసేవారు ఎవరు అన్నది గుర్తించటం ప్రభుత్వానికి పెద్ద సమస్యేమీ కాదు. అలా గుర్తించిన వారిని కౌలు రైతులుగా నమోదు చేయవచ్చు. అలాంటి ఉద్దేశంలేని పాలకులు ఎన్ని కౌలు చట్టాలు చేసినా, కౌలు గుర్తింపు అనేది భూయజమానుల యిష్టానికి వదిలివేశారు. అందుకే భూసంస్కరణ చట్టాలు అలంకారప్రాయమైనాయి.

రైతుభరోసా ద్వారా యిచ్చే ఆర్థిక సహాయం విషయంలోనూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాట మార్చింది. ఎన్నికల ప్రచారంలో ప్రతి సం॥ మే లో 12,500 రూ॥ చొప్పున నాలుగు సంవత్సరాల్లో 50 వేలు ఇస్తామని చెప్పారు. మోది ప్రభుత్వం కూడా పి.ఎం.కిసాన్ పథకంద్వారా ప్రతి రైతుకు మూడు దఫాల్లో ఆరువేలు చొప్పున ఇస్తామని ప్రకటించి ఎన్నికల ముందే మొదటి దఫా మొత్తాన్ని రైతుల బ్యాంక్ ఎకౌంటులో జమ చేశారు. వైసిపి, ఎన్‌డిఏ విడివిడిగానే రైతుకు సహాయం గురించి ప్రకటించాయి. రెంటి అనుసంధానం అనేమాట వైసిపి నుండి రాలేదు. ఎన్నికల్లో గెలిచి వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా రైతు భరోసా పథకం ద్వారా 12,500 వేలు (మోది పథకంతో సంబంధం లేకుండా) చెల్లిస్తామని ప్రకటించింది. పథకం అమలు ప్రారంభించే టప్పుడు మాత్రం మాట మార్చింది. పథకాన్ని వైయస్ఆర్ రైతు భరోసా - పి.ఎం. కిసాన్ పథకంగా మార్చి సంవత్సరానికి 13,500 రూ. ప్రకటించి పి.ఎం. కిసాన్ పథకం 6 వేలుతో పాటు రాష్ట్రప్రభుత్వం 7,500 ఇస్తుందని ప్రకటించింది. దాన్ని మూడు దఫాలుగా చెల్లిస్తానని చెప్పి, పథకాన్ని ఐదు సంవత్సరాలకు పొడిగించింది. ఆవిధంగా ఐదు సంవత్సరాల్లో 30 వేల రుణాన్ని తగ్గించింది. రైతుల పక్షపాతిగా చెప్పుకొంటున్న జగన్ మోహన్‌రెడ్డి రైతు పక్షపాతం ఎలాంటిదో దీనిద్వారా వెల్లడైంది.

ఈ పథకం అమలులో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. అర్హులుగా వున్న అనేకమంది రైతులకు రుణసహాయం అందటంలేదు. బ్యాంక్ ఖాతాకు ఆధార్ అనుసంధానం కాలేదని, 'వెబ్‌లింక్'లో పేరు నమోదు కాలేదని, సర్వేనంబర్లు తప్పుగా వున్నాయని, పట్టాదారు పాస్ పుస్తకాలు లేవని అందుకు కారణాలు చెబుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని అనేక గ్రామాల్లో ఇప్పటివరకు ఎవరికీ రుణసహాయం అందలేదు. గిరిజన ప్రాంతాల్లో పథకం అమలు కాదనే అనుమానాలు రెవిన్యూ అధికారుల నోటినుండి వస్తున్నాయి. లబ్ధిదారుల జాబితాలో పేర్లు వున్న కొందరికి కూడా బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు పడలేదు. రెవిన్యూ అధికారులు చెబుతున్న కారణాలు సరిచేయించుకోవటానికి రైతులు పంచాయితీ, రెవిన్యూ ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. నవంబర్ 15 లోపు లోపాలు సరికాకపోతే ఆ తర్వాత పథకం వారికి వర్తించదు. ఇందువలన రైతులు చాలా ఆందోళన పడుతున్నారు.

రైతాంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య లైన, ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, డీజిల్ ధరలు పెరుగుతూ సేద్యపు ఖర్చులు భారంగా మారటం, అవసరం మేరకు పంట రుణాలు అందకపోవటం, పండించిన పంటలకు న్యాయమైన ధరలు లభించకపోవటం, పంటలు అమ్ముడుకాకపోవటం, వీటి ఫలితంగానే రైతాంగం అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. రైతాంగం ఎదుర్కొంటున్న ఈ ప్రధాన సమస్యల పరిష్కారం ఎడల అన్ని పాలకపార్టీలు ఒకే వైఖరితో వున్నాయి. ఈ సమస్యలు పరిష్క రించకుండా రైతాంగాన్ని మభ్యపెట్టే విధానాలతో వ్యవహరిస్తున్నారు. అందులో భాగమే రుణమాఫీ, పంటరాయితీ, రైతుభరోసా లాంటి పథకాలు ముందుకు తెస్తున్నారు. వీటిద్వారా తమ సమస్యలకు కారణమైన మౌలిక సమస్యలనుండి రైతులను ప్రక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. నిరంతరం పెరుగుతున్న సేద్యపు ఖర్చులను గమనిస్తే రైతుభరోసా పథకంద్వారా అందించే సహాయం రైతు ఎదుర్కొంటున్న సమస్యలకు ఏమాత్రం పరిష్కారం కాబోదు. వారి మౌలిక సమస్యలు పరిష్కారం చేస్తే ఇలాంటి ఏ పథకాలూ రైతులకు అవసరం వుండదు.

పథకాల పేరుతో మభ్యపెట్టి, వంచించే పాలకుల విధానాలను రైతాంగం గ్రహించాలి. భూస్వాములను, ధనిక రైతులను, సంపన్న రైతులను రైతు భరోసా పథకం నుండి మినహా యించాలి. భూయజమాని అనుమతిలేక పోయినా భూమిలేని కౌలుదారులందరికీ పథకాన్ని ప్రభుత్వం వర్తింపచేయాలి. ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల ధరలు తగ్గించే విధానాలు అమలుజరిపి, వాటిపై సబ్సిడీని ఎక్కువ శాతంలో పెంచాలి. అవసరం మేరకు వడ్డీలేని రుణాలను, పావలా వడ్డీ రుణాలను రైతులకు అందించాలి. పంటఖర్చు, కౌలుఖర్చు, కుటుంబ శ్రమను కలిపి పంట ఖర్చుగా నిర్ణయించి దానిపై 50శాతం అధికంగా మద్దతు ధరను ప్రకటించాలి. పంట ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. వీటిని సాధించుకోవటానికి రైతాంగానికి ఉద్యమ బాట తప్ప మరో మార్గం లేదు.

ooo